క్లుప్తంగా

చిన్నారులకు టీకాలు వేయించాలి



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ సూచించారు.ఆయన బుధవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అక్కడి యుపీహెచ్‌సీలోని రికార్డులు, వ్యాక్సిన్లు నిల్వ ఉంచే పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీ వరకు జరిగే ఉధృత అతిసార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు తన పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలున్న ప్రతి ఇంటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. టీకాలు వేసిన వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని, వాటిని ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గర్భవతుల వివరాలను నమోదు చేసి, సమయానుసారంగా ఆరోగ్యసేవలు అందించాలని చెప్పారు. డాక్టర్ శ్రీరాములు, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సామూహిక వివాహాల సందడి



ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక వివాహ వేడుక

కర్నూలు(రూరల్): నగరంలోని జీబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం యువతీ యువకులకు సామూహిక వివాహాలు నిర్వహించారు. కమిటీ గౌరవాధ్యక్షుడు ఇస్మాయిల్, జీబీ దర్గా పీఠాధిపతి సయ్యద్ అత్తర్ పాషా ఖాద్రి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ..18 ఏళ్లుగా పేద ముస్లిం కుటుంబాల యువతకు వివాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నూతన వధూవరులకు రూ.50 వేల విలువ చేసే సామగ్రి అందజేశారు. ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్, హుసేన్, కార్యదర్శి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: దక్షిణ ఆంధ్రప్రదేశ్ గుంతకల్లు విశ్వహిందూ పరిషత్ సేవా విభాగ్, బహుళార్థ సాధక కేంద్రం అమృత వర్షిణి బాల కళ్యాణ ఆశ్రమంలో 2023–24 విద్యా సంవత్సరం ఉచిత విద్యను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుఆశ్రమం కార్యదర్శి తెలిపారు. తల్లి తండ్రి లేని 8వ సంవత్సరాలలోపు పేద విద్యార్థులు ఆశ్రమంలో ప్రవేశం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 98667 24019 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు:కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి దూపాడుకు వెళ్లే మార్గంలో హ్యాంగవుట్ హోటల్ వెనుకభాగంలో రైలు కింద పడి ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. బుధవారం ఉదయం రైలు పట్టాలపై మృతదేహం ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించాడు. మృతదేహాన్ని రైలు దాదాపు 200 మీటర్లు ఈడ్చుకుంటూ వెళ్లడంతో గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జు అయ్యింది. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, ఘటనా స్థలంలో మృతునికి సంబంధించిన ఆకుపచ్చ అడ్డపంచ, చిలకపచ్చ పూల డిజైన్ ఉన్న తెల్లని షర్టు పడిఉన్నాయి. షర్టు కాలర్, జేబుపైన దినేష్ టైలర్ స్టిక్కర్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 94417 59875 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్ఐ కోరారు.

గిరిజన భవనాన్ని వినియోగంలోకి తేవాలి

కర్నూలు(అర్బన్): జిల్లా కేంద్రంలో రూ.కోటి నిధులు వెచ్చించి నిర్మించిన గిరిజన భవనాన్ని వినియోగంలోకి తేవాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం గిరిజన సంక్షేమ శాఖ జేడీ మల్లికార్జునరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కర్నూలు నగర శివారులో అన్ని వసతులతో భవనాన్ని నిర్మించారన్నారు. నిర్మాణ పనులు 2019లో పూర్తయినా, నేటికి నిరుపయోగంగానే ఉందన్నారు. గిరిజన భవన్‌ను ప్రారంభిస్తే జిల్లాలోని గిరిజన వర్గాల వివాహాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే భవనంలో గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు.టీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేష్ ఉన్నారు.

మెదడులో కలవరం

- పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితుల సంఖ్య
- ఆధునిక పద్ధతిలో ఆపరేషన్ల ద్వారా కణతి తొలగింపు
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యసేవలు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే



కర్నూలు(హాస్పిటల్): మానవ శరీరం పనితీరు మొత్తం మెదడు మీదే ఆధారపడి ఉంటుంది. మెదడులో ఏ మాత్రం తేడా వచ్చినా జీవితం కల్లోలంగా మారుతుంది. శరీరం మొత్తం స్తంభించిపోతుంది. మెదడులో వచ్చే కణితులు ఇంకా ప్రమాదం. ఈ కణితులపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తోంది.

కర్నూలు ప్రాంతంలో ఇటీవల మెదడు కణితుల కేసులు ఎక్కువవుతున్నాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు చెందిన వారు కూడా చికిత్స కోసం ఇక్కడికే వస్తున్నారు. గతంలో మెదడులో ఏర్పడే కణితులకు చికిత్స కోసం హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కర్నూలులోనే అత్యాధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి లక్ష మందిలో ఏడుగురు మెదడు కణితుల సమస్యతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూరోసర్జరీ విభాగంలో ప్రతి బుధ, శనివారం ఓపీ చికిత్స చేస్తారు. మెదడు, వెన్నుపూసకు సంబంధిత సమస్యలతో 500 మంది దాకా రోగులు వస్తుండగా అందులో 20 నుంచి 30 మంది మెదడులో కణితులతో బాధపడేవారు ఉంటున్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ వారానికి 30 మంది దాకా వస్తున్నారు.

మెదడులో కణితులు రకాలు

మెదడు కణజాలంలో ఏర్పడే ముద్దను మెదడు కణితి అంటారు. ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్లు మెదడులో ఏర్పడుతుండగా, సెకండరీ ట్యూమర్లు శరీరంలో వివిధ భాగాల్లో సోకి రక్తంలో ప్రవేశించి మెదడుకు చేరతాయి. కొన్ని రసాయనాల బారిన పడటం, రేడియేషన్ ఎక్కువగా ఉండటం, ఎక్స్ టీమ్ వైరస్‌బారిన పడటం వల్ల ఈ కణితులు ఏర్పడతాయి.

కారణాలు

మెదడులో కణితులు జన్యుపర లోపాల వల్ల, వంశపారంపర్యంగా వస్తాయి. మెదడుకు రేడియేషన్ సోకడం, సెల్‌ఫోన్ విపరీతంగా వాడడం ద్వారా మెదడులో గడ్డలు ఏర్పడే అవకాశం ఉంది.

వ్యాధి నిర్ధారణ

మెదడులో కణితులను క్లినికల్, రేడియాలజీ, సర్జికల్ పద్ధతుల్లో నిర్ధారిస్తారు. ఇందులో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లో తేలిపోతుంది. కొందరిలో సర్జికల్ ద్వారా కూడా నిర్ధారణ చేయవచ్చు.

లక్షణాలు

మెదడులో సాధారణంగా కణాలు చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్నిసార్లు కణాలు చనిపోకుండానే కొత్తవి పుట్టుకొస్తాయి. అలా వచ్చిన కణాలు కణితులుగా మారతాయి. వీటిలో కొన్ని క్యాన్సర్‌గా మారి ప్రాణాంతకమవుతాయి. మరికొన్నింటిని శస్త్రచికిత్స ద్వారా తొలగిస్తే ఏ సమస్య ఉండదు. తలనొప్పి, వాంతులు, చూపు మందగించడం, ఒత్తిడి పెరగడం , స్పృహ కోల్పోవడం వంటివి సాధారణ లక్షణాలు కాగా, మెదడులో కణితి ఏర్పడిన స్థానాన్ని బట్టి మాట తడబడటం, చూపు మసకగా కనిపించడం, చెవులు వినిపించకపోవడం, మూతి వంకరపోవడం, ఫిట్స్, పక్షవాతం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

అత్యాధునిక పరికరాలతో శస్త్రచికిత్స



న్యూరోసర్జరీ విభాగానికి ప్రతి ఓపీలో 30 మంది దాకా మెదడులో కణితులతో బాధపడే వారు వస్తున్నారు. వీరిని అడ్మిట్ చేసి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోప్‌లు, ట్యూసా మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఏడాదికి వందకు పైగా శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ప్రహ్లాద, హెచ్ఓడీ, న్యూరోసర్జరీ విభాగం, కర్నూలు జీజీహెచ్

మెదడులో కణితులను బట్టి చికిత్స



మెదడులో ఏర్పడిన కణితులను నాలుగు గ్రేడ్‌లుగా విభజించి చికిత్స అందిస్తాం. కణితుల స్థానంపై కూడా ఆధారపడి చికిత్స ఉంటుంది. గ్రేడ్ 1, 2లలో మూడు సెం.మీ కన్నా తక్కువగా ఉండే కణితులను రేడియేషన్ ద్వారా తగ్గించవచ్చు. గ్రేడ్ 3, 4 కణితులు ఉంటే జీవితకాలం తక్కువగా ఉంటుంది. దీనికి రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ వంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కణితులను త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే మంచిది.

–డాక్టర్ ఎస్.సుమంత్‌కుమార్, న్యూరోసర్జన్, కర్నూలు

17న పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2016లో డిగ్రీ చేరి ఒక సబ్జెక్టు ఫెయిలైన విద్యార్థులకు వర్సిటీ మరో అవకాశం కల్పించడంతో ఈ నెల 17న పరీక్షలు ప్రారంభం కానున్నాయని బుధవారం వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు తెలిపారు వీరి కోసం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పరీక్షల డీన్ ఆచార్య సి.విశ్వనాథరెడి చెప్పారు. 10వ తేదీ నుంచి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద విద్యార్థులు హాల్ టికెట్లు పొందవచ్చని సూచించారు.

కర్నూలుకు రానున్న కంచి పీఠాధిపతి

కర్నూలు కల్చరల్: కంచి పీఠాధిపతులు జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి వారు కర్నూలుకు రెండు రోజుల పర్యటనకు రానున్నట్లు అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం ప్రతినిధులు తెలిపారు. స్వామీజీ విజయ యాత్రలో భాగంగా ఈనెల 9వ తేదీ ఉదయం 7 గంటలకు కర్నూలు నగరం ఖండేరి వీధిలోని శంకర మఠం, శంకర వేద విద్యాలయంకు రానున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు శంకర మఠంలో స్వామిజీకి స్వాగతం, 10 గంటలకు శ్రీ మహా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి పీఠం పూజ, 10వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ మహా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి పీఠం పూజలో పాల్గొంటారని పేర్కొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే సంక్షేమ పథకాలు



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక 3వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బండిమెట్ట, మొగల్‌పుర, సాగ్ మండి వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ క్యాలెండర్ అందించి వారికి చేకూరిన పింఛన్, చేయూత, ఆసరా, వాహనమిత్ర, చేదోడు, తదితర పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు తెచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్పొరేటర్ షాజహాన్ పర్విన్, నాయకులు ఖాదర్ బాషా, ఖుద్దూస్, చాంద్ బాషా, ముజహీద్, మున్న, గౌసియా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వలంటీర్లకు సత్కారం

కర్నూలు (టౌన్): ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న వలంటీర్లను సత్కరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ బుధవారం వెల్లడించారు. 8వ తేదీ ఉదయం 10 గంటలకు 1వ వార్డు నుంచి 6వ వార్డు వరకు 17 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను స్థానిక ఖండేరి వీధిలోని ఎస్‌పీఎస్ స్కూల్ వద్ద, 9వ తేదీన 7వ వార్డు నుంచి 12వ వార్డు వరకు ఉన్న 18 నుంచి 29 సచివాలయాల వలంటీర్లకు స్థానిక దండిగేరి వద్ద, 13వ తేదీన 13వ వార్డు నుంచి 18వ వార్డు వరకు ఉన్న 30 నుంచి 44 సచివాలయాల వలంటీర్లకు స్థానిక చాణిక్యపురి కాలనీలోని కుడా ప్రాంగణం, 14వ తేదీన 22వ వార్డు నుంచి 26 వార్డుల వరకు ఉన్న 56 నుంచి 64 సచివాలయాల వలంటీర్లకు స్థానిక ఆరోరానగర్ వద్ద, 15వ తేదీన 42 నుండి 47 వార్డుల పరిధిలోని 109 నుంచి 122 సచివాలయాల వలంటీర్లకు స్థానిక లేబర్ కాలనీలో అలాగే 16వ తేదీన 48 నుంచి 52 వార్డుల పరిధిలో ఉన్న 123 నుంచి 132 సచివాలయాలకు చెందిన వలంటీర్లకు కొత్తపేట రైతుబజార్ వద్ద సత్కార కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

చురుగ్గా సర్వే పనులు



రోడ్డు విస్తరణకు సంబంధించి సర్వే చేస్తున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఇరుకుగా ఉన్న రహదారులను నగరపాలక అధికారులు గుర్తించారు. స్థానిక కిడ్స్ వరల్డ్ నుంచి ఉస్మానియా కళాశాల వరకు రహదారిని 50 అడుగుల మేర విస్తరించేందుకు సర్వే పనులు బుధవారం నుంచి చురుగ్గా సాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హయ్యత్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ శబరీష్‌తోపాటు రహదారులు, భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఫణీరామ్ సర్వే పనులు పరిశీలించారు. పలు సూచనలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఏడున్నర మీటర్లు, మధ్యలో ఒకటిన్నర మీటర్ల డివైడర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయండి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ప్రతి రోజూ ఒక్కో ఏఎన్ఎం పది హెల్త్ ఐడీలు జనరేట్ చేసి ఎన్‌సీడీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. ఆయన బుధవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్ట్‌లు పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు పీహెచ్‌సీలో కాన్పులు అయ్యేలా చూడాలని, ప్రమాదకర లక్షణాలున్న గర్భవతులను గుర్తించి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, అధిక రక్తపోటు, మధుమేహం ఉన్న వారికి వైద్యాధికారి అందించిన సేవలను ఎంఓ హెల్త్‌యాప్‌లో అదే రోజు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి ఇంటి వద్దే ఆరోగ్యసేవలు అందించాలని ఆదేశించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలని చెప్పారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి, వైద్య సిబ్బంది ఉన్నారు.

పెన్షన్ పెంచాలని పీఎంకు పోస్టుకార్డులు



పీఎంకు పంపనున్న పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న పెన్షనర్లు

కర్నూలు(రూరల్): ఈపీఎఫ్ పెన్షనర్లకు ఇస్తున్న పెన్షన్ రూ.వెయ్యి నుంచి రూ.9 వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రికి పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు. బుధవారం స్థానిక ఎస్‌ఏపీ క్యాంపులో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం నాయకులు మోహన్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని, పెన్షనర్లకు రైలు ప్రయాణంలో రాయితీ ఇవ్వాలని, వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. సంఘం నాయకులు సాయిబాబా, చెన్నకేశవులు, యాగంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



33వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 33వ వార్డు పాత కల్లూరులో స్థానిక కార్పొరేటర్ నరసింహులు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజలు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కాలనీలో పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రజల కోసం నిరంతర పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందరం అండగా నిలవాలని కోరారు. రైతు సంఘం నాయకులు రంగప్ప, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, కల్లూరు అర్బన్ వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, నాయకులు శ్రీనివాసులు యాదవ్, పెద్దన్న, తిరుపాలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


టిడ్కో, ఇందిరమ్మ గృహాలు కేటాయించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని జగన్నాథ గట్టుపై నిర్మించిన టిడ్కో, ఇందిరమ్మ గృహాలను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని గృహ లబ్ధిదారుల సాధన సమితి కన్వీనర్ జగన్నాథం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు.సభ్యులు మహేష్, రామకృష్ణారెడ్డి,రసూల్, నాగరాజు, నల్లన్న పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు (రూరల్): గుంటూరు నగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఆర్ భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబయ్య, బీసన్న, శేషన్న, కాశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలకపాత్ర అని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డ్వామా పీడీ హాజరై మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లో కోరిన వారికి పనులు కల్పించి, నిజాయితీగా పని చేస్తూ చురుకైన పాత్ర పోషిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఉపాధి పనుల ద్వారా కూలీల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించి పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ఇస్తున్న 100 శాతం సబ్సిడీపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శిక్షణా తరగతులకు కృష్ణమోహన్, బ్రహ్మానందరెడ్డి, నరసింహులు, నందకిశోర్ శిక్షకులుగా వ్యవహరించారు. ఓర్వకల్లు, కర్నూలు, కృష్ణగిరి, వెల్దుర్తి, కల్లూరు, కోడుమూరు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఉపాధి కూలీలు గరిష్ట వేతనం రోజుకు రూ.272 పొందేలా పనులు చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుట్టపాడు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కాల్వబుగ్గ వద్ద ఉన్న నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

నూతన మెనూ అమలు తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): వసతి గృహాల్లో తప్పనిసరిగా నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంక్షేమ వసతి గృహాల అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె తన క్యాంపు కార్యాలయంలో అన్ని సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో వసతి గృహాల మైనర్ రిపేర్లకు రేపటిలోపు అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. వసతి గృహాల్లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని సాంఘిక సంక్షేమాధికారి ప్రతాప్ సూర్య నారాయణ రెడ్డి కలెక్టర్‌కు వివరించగా.. వాటితోపాటు వారానికి ఒక రోజు నైపుణ్య ఆధారిత కార్యక్రమాలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. పోస్టుమెట్రిక్ విద్యార్థులకు నైపుణ్య ఆధారిత కార్యక్రమాలు, ప్రీమెట్రిక్ విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్, స్పోకెన్ ఇంగ్లిషులపై పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి వసతి గృహానికి ఒక రిసోర్స్ పర్సన్‌ను గుర్తించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో 100 శాతం విద్యార్థుల హాజరు ఉండేలా చూడాలన్నారు. సాంఘిక సంక్షేమాధికారి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహాపర్వీన్, ఇన్‌చార్జి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

బది'లీల'లెన్నో!

కర్నూలు సిటీ: వెల్దుర్తి మండలంలో ఓ ఎస్‌జీటీ టీచర్ 8 ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తుండడంతో కంపల్సరీ బదిలీకి అర్హులు, తాను పని చేసే స్కూల్ ఫోర్త్ కేటగిరీ కావడంతో మొత్తం 44.16 పాయింట్లు వచ్చాయి. ఎంఈఓలు ధ్రువీకరించిన తర్వాత కూడా అవే పాయింట్లు ఉన్నాయి. అయితే డీఈఓ ధ్రువీకరించే క్రమంలో జరిగిన పొరపాటుతో 8 ఏళ్లకు బదులు రెండేళ్లుగా నమోదు చేయడంతో కేవలం 16.16 పాయింట్లు మాత్రమే వచ్చాయి. దీనిపై ఈ నెల 4వ తేదీన డీఈఓకు సమస్య వివరించినా తప్పును సరి చేయలేదు. ఈ విషయంపై డీఈఓ వద్దకు వెళితే కోర్టుకు వెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఓ సంఘం చెబుతోంది.

- వెల్దుర్తి మండలం కృష్ణాపురంలోని ఓ స్కూల్ టీచర్ అక్కడ 6 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అయితే తుది జాబితాలో మాత్రం లాంగ్‌స్టాండ్ అని కంపల్సరీ (8 సంవత్సరాలు) అని దరఖాస్తులో నమోదైంది.
- జిల్లాలో ఈ ఇద్దరు ఉపాధ్యాయులే కాదు. చాలా మంది టీచర్లు వారి భాగస్వామం లేకుండానే చేయని తప్పులకు పాయింట్లు కోల్పోయారు. దరఖాస్తుల్లో జరిగిన తప్పులను సరి చేసేందుకు డీఈఓలకు అవకాశం ఇచ్చిన సమయంలో కొంత మంది హెచ్‌ఎంలను ఏర్పాటు చేసి వెరిఫై చేయించారు. కానీ బదిలీలకు సంబంధించిన అన్ని అంశాలపై వారికి విద్యాశాఖ అధికారి సరైన సలహాలు, సూచనలు చేయకపోవడంతో చాలా మంది టీచర్లు తమకు రిఅపోర్షన్ పాయింట్ల విషయంలో అధికారుల వల్లే నష్టపోయామంటూ ఆఫీస్ చుట్టు వినతులు పట్టుకొని ప్రదక్షిణలు చేస్తున్నారు. సమయం ముగిసిందని తెలిసినా డీఈఓ వినతులను తీసుకొని సెక్షన్లకు రెఫర్ చేస్తుండడంతో వినతులు ఇచ్చిన వారు సిబ్బందితో వాదనలు చేస్తున్నారు. ఇదిలాఉండగా వెబ్ ఆప్షన్ల ప్రక్రియ నేటితో ముగియనుంది.

గ్లోబల్ డెంటల్ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్):బెంగళూరులో ఈ నెల 16వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించే ఫస్ట్ గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆన్ బేసల్ ఇంప్లాటాలజీ సదస్సుకు కర్నూలుకు చెందిన దంత వైద్యులు డాక్టర్ పి.సునీల్‌కుమార్‌రెడ్డి ఆహ్వానం అందింది. దేశ విదేశాల నుంచి వైద్యుల తోపాటు ఈ సదస్సులో ఆయన కార్టికల్ ఇంప్లాంట్స్ –బిగినర్స్‌పర్స్పెక్టివ్‌అనేఅంశంపైప్రసంగించనున్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కర్నూలు సిటీ: సీపీఎస్‌ను రద్దు చేయకపోగా, కొత్తగా జీపీఎస్–2023 తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సంఘం నాయకులు ఇస్మాయిల్, సుబ్రహ్మణ్యం శర్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిరూపం.. శాస్త్రీయ నృత్యం



మాట్లాడుతున్న కూచిపూడి సిద్దేంద్ర కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి

కర్నూలు కల్చరల్: భారతీయ సంస్కృతికి శాస్త్రీయ నృత్యాలు ప్రతిరూపాలని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కూచిపూడి సిద్దేంద్ర కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత, బెంగళూరు బంగార్ పేట భరత కళ గ్రామ ప్రెసిడెంట్ డాక్టర్ వసంత్ కిరణ్ అన్నారు. భారత కళ గ్రామ, నాట్య వేద కళా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు బుధవార పేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో బుధవారం ఐదు రోజుల కూచిపూడి వర్క్‌షాప్‌ను వీరు ప్రాంరభించారు. కూచిపూడి నృత్య భంగిమలు, ముద్రలపై అవగాహన కల్పించారు. నిర్వాహకులు కె.తేజేశ్వర్, కూచిపూడి నృత్య శిక్షకులు సాయి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.